క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా బిల్లులు చెల్లించలేని పేదవారు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం అల్లాపూర్‌కు చెందిన బండారు సూర్య ప్రకాష్‌కు లక్ష, మహ్మద్ పీర్ అహ్మద్‌కు రూ. 2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. అర్హులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉత్సవాల ఆహ్వానం అందజేత



బండి రమేష్ దంపతులకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో 30న ఉగాది ఉత్సవాలు, ఏప్రిల్ 6న శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నారు. వేడుకలకు హాజరవ్వాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆలయ పాలక కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ మాజీ అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్, ఆలయ కమిటీ చైర్మన్ బాకారం బిచ్చయ్య, డివిజన్ అధ్యక్షుడు బి. సతీష్ గౌడ్, కేపీ ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ఆలయ పాలక కమిటీ సభ్యులు అనూపమ, జై నర్సింహులు, దూడల జనార్దన్ గౌడ్, పి. మల్లికార్జున రెడ్డి, ఏ. నాగేశ్వరరావు, అనిల్ కుమార్, ఆలయ అర్చకులు సనత్‌చార్యులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో రక్తదాన శిబిరం



కేపీహెచ్‌బీకాలనీ: సినీ హీరో రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా అరవింద చెర్రీ, సందీప్ ధనపాల ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ తల్లి ఆలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రవణం స్వామి నాయుడు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నూతి రాంబాబు నాయుడు, రాంబాబు, బీఎస్‌ఎన్ రాజు, కొల్లా శంకర్, వెంకటేశ్వరరావు, కలిగినిడి ప్రసాద్, వులగం సుబ్బు, యాళ్ల శిరీష, మెగా అభిమానులు ఉచా రాంబాబు, నూతి రాంబాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

మోతీనగర్: మహ్మద్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, అబ్దుల్ రహీం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఎమ్మెల్యే ఖర్జూరం తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేయించారు.



ఉపవాస దీక్షను విరమింపజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అర్హులకు తప్పని తిప్పలు !

రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న పేదలు



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఉప్పల్ ప్రాంతంలో అద్దెకుంటున్న శైలజ కుటుంబానికి ఇప్పటి వరకు రేషన్‌కార్డు జారీచేయలేదు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా.. కూడా రాలేదు. కార్డు లేకపోవడంతో గృహజ్యోతితో సహా పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇతర పథకాలు అందడం లేదు. ఆమె కుటుంబానికే కాదు నగరంతో సహా శివారుల్లోని వందలాది నిరుపేద కుటుంబాలకు తెల్లరేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను నోచుకోని పరిస్థితి నెలకొంది.

సంక్షేమ పథకాలు పొందాలంటే ఆహార భద్రత కార్డు (తెల్ల రేషన్ కార్డు)ను ప్రభుత్వం ప్రామాణికం చేసింది. అన్ని అర్హతలున్నా.. కార్డులేని పేదలకు ప్రభుత్వ పథకాలు పొందటం ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానించినా... ప్రభుత్వం జాప్యం చేస్తోంది. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

167 మాత్రమే పంపిణీ

గృహజ్యోతి, రూ.500 సిలిండర్, తాజాగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి తెల్లరేషన్ కార్డు తప్పనిసరి కావడంతో అర్హులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రామ సభలు నిర్వహించి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకుంది. తాజాగా మీ-సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కానీ జనవరిలో ఎంపిక చేసిన గ్రామాల్లో 167 కొత్త కార్డులను మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం.

పెండింగ్‌లో 86,885 దరఖాస్తులు

నగరంతో పాటు శివారులోని 29 పురపాలక సంఘాల్లో కొత్త రేషన్‌కార్డు ఊసేలేదు. ప్రస్తుతం ఉన్న కార్డుల్లో కూడా కుటుంబసభ్యుల పేర్లు చేర్పించేందుకు 86,885 దరఖాస్తులను మీ-సేవా కేంద్రాల ద్వారా తీసుకోగా.. అవి కూడా పెండింగ్‌లోనే పెట్టారు.

క్షేత్రస్థాయిలో విచారణ

నగర శివారుల్లో కొత్త కార్డులు, సభ్యుల పేర్ల నమోదు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ చేపట్టనున్నారు. మండల స్థాయిలో ఆర్ఐలు తన లాగిన్ వచ్చినవి మాత్రమే పరిశీలించనున్నారు. ఆ తర్వాత వాటిని విచారించి అర్హులను ఎంపిక చేయనున్నారు. దీనికి సంబంధించి మౌఖిక ఆదేశాలు వచ్చాయని పౌర సరఫరాల అధికార వర్గాలు చెబుతున్నాయి.

- మేడ్చల్ జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు : 5,23,938
- కొత్తగా వచ్చిన దరఖాస్తులు : 72,864
- కార్డుల్లో సభ్యుల పేర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులు: 85,885

జల్సాల కోసం దొంగతనాలు

- రూ. 6 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ల స్వాధీనం
- నిందితుడిని రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐ రవికుమార్

కేపీహెచ్‌బీకాలనీ: జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడిన వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ. 6 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐ రవికుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన జీవ గణేశన్ (26) పటాన్‌చెరువు ప్రాంతంలోని కూరగాయల మార్కెట్ వద్ద నివాసం ఉంటున్నాడు. మొదట్లో మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగించగా.. కుమార్ అనే వ్యక్తి పరిచయమై అధిక డబ్బులు సంపాదించి జల్సాగా బతకాలంటే తనతో పాటు ముంబైకి రావాలని తీసుకువెళ్లాడు. అక్కడ ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరీ చేసి విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. ముంబైతో పాటు దొంగతనాలకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని భావించిన జీవ గణేశన్ ఇక్కడికి వచ్చి రాత్రి వేళల్లో తాళం వేసి ఉన్న ఇల్లు, ఐటీ ఉద్యోగులు నివాసం ఉండే ప్రాంతాలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 23న కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్ 1, 7వ ఫేజ్‌లలో ల్యాప్ టాప్‌లు ఎత్తుకుపోయిన ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన జీవ గణేశన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, మియాపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఐదు కేసుల్లో నిందితుడు కాగా కేపీహెచ్‌బీ పరిధిలోని రెండు, కూకట్‌పల్లి పరిధిలోని ఒక కేసులో ఆరు ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

ఉగాది పురస్కారాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మోతీనగర్: శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది -2025 పండుగ పర్వదిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దీ బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్యం, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) హైదరాబాద్ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉభయ తెలుగు రాష్ట్రాలలోని కవులు, కళాకారులు, రచయితలు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారులను సన్మానించి ఉగాది పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు.
- 13 ఏప్రిల్ హైదరాబాద్‌లో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఇందులో పాల్గొనేవారు వారి సేవలు, ప్రతిభ గురించి తెలిపే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్స్ ఫొటోలు, జీరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేసి 31వ తేదీ లోగా ఆల్ దీ బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకగటాపురం, పోస్టు తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు -15కు పంపించాలని సూచించారు. వివరాల కోసం 9652347207 నంబర్‌ను సంప్రదించాలని సంస్థ అధ్యక్షులు లయన్‌డా. ఇ.ఎస్.ఎస్. నారాయణ తెలిపారు.

ప్రగతి రథచక్ర అవార్డుల ప్రదానం



అవార్డు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో డిపో మేనేజర్ హరి

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లకు ప్రగతి రథ చక్ర అవార్డులను కూకట్‌పల్లి డిపో మేనేజర్ డి. హరి గురువారం అందజేశారు. ఎక్కువ ఆదాయం తెచ్చిన ఉత్తమ కండక్టర్, ఎక్కువ మైలేజ్ తెచ్చిన డ్రైవర్, మంచి మెకానిక్‌లకు ఈ అవార్డులను అందజేశారు. సుమారు 23 మంది సిబ్బంది అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డిపో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మెకానికల్ ఇంజినీర్ రాజేశ్వరి, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ పోర్టుకు ఏసీ బస్సులు

మూసాపేట: లింగంపల్లి నుంచి శంషాబాద్ ఆర్‌జీఐఏ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు ప్రతి 50 నిమిషాలకు కొత్తగా నాలుగు ఏసీ పుష్పక్ బస్సులు ఆపరేట్ చేస్తున్నామని ఆర్టీసీ కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి గురువారం తెలిపారు. బస్సు లింగంపల్లి నుంచి చందానగర్, ఆల్విన్ క్రాస్ రోడ్డు, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా ఎయిర్‌పోర్టుకు వెళ్తుందని, అదే విధంగా మియాపూర్ నుంచి ఎయిర్‌పోర్టుకు వయా జేఎన్‌టీయూ, శిల్పారామం, హైటెక్ సిటీ, రాయదుర్గం, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి మీదుగా ప్రతి 15 నిమిషాలకు ఒక ఏసీ బస్సు నడిపిస్తున్నామని తెలిపారు. లింగంపల్లి నుంచి ఎయిర్ పోర్టుకు మొదటి బస్సు 5.45 చివరి బస్సు 8.45, మియాపూర్ నుంచి ఎయిర్‌పోర్టుకి మొదటి బస్సు 12.15, చివరి బస్సు 11.45, లింగంపల్లి, ఆల్విన్‌క్రాస్ రోడ్డు, మియాపూర్ జేఎన్‌టీయూ నుంచి ఎయిర్‌పోర్టుకు రూ. 300, శిల్పారామం, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి నుంచి రూ.250 ఛార్జీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీ టెక్ సెమిస్టర్ ఫలితాల విడుదల

సాక్షి, సిటీబ్యూరో: జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గత ఫిబ్రవరి నెలలో నిర్వహించిన బీటెక్ నాల్గో సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 27,533 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 19,385 మంది విద్యార్థులు అన్ని సబ్జెక్టు లలో ఉత్తీర్ణత సాధించగా మొత్తం ఉత్తీర్ణత శాతం 70.41 శాతంగా నమోదైంది. విద్యార్థులు తమ వ్యక్తిగత ఫలితాలను జేఎన్టీయూహెచ్ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవాలని అధికారులు సూచించారు.

సదస్సులతో విద్యార్థులకు అవగాహన

హెచ్‌సీయూ వీసీ బీజేరావు

నిజాంపేట్ : సదస్సులతో పారిశ్రామిక రంగంలో జరుగుతున్న అనేక విషయాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని హెచ్‌సీయూ వీసీ, ప్రొఫెసర్ బీజేరావు అన్నారు. విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో స్థిరమైన వ్యాపార సరళిలో భవిత్తు వాణిజ్య వ్యవహారాల నిర్వహణ అనే అంశంపై 7వ అంతర్జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మరియానో మరికోస్ స్టేట్ యూనివర్సిటీ, ఫిలిప్స్ డా.అరేలీనే గొంజాలెస్ నైతిక పద్ధతులకు అనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలను ఎలా పునర్నిర్మించుకోవచ్చన్న దాని గురించి విలువైన సలహాలను అందించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ఖోఖో మెన్స్ విన్నర్స్ జేఎన్‌టీయూ హైదరాబాద్ విద్యార్థులు



ఖోఖో ఉమెన్స్ విన్నర్స్


కేపీహెచ్‌బీకాలనీ: క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపు కోసం ప్రయత్నించడం క్రీడాకారులు లక్ష్యమని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వెంకటేశ్వరావు అన్నారు. జేఎన్‌టీయూహెచ్ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఖోఖో, కబడ్డీ వీసీ ట్రోఫీ ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఒత్తిడిని తొలగిస్తాయన్నారు. క్రీడాకారులకు ఆల్ ఇండియా స్పోర్ట్స్ కోటా ద్వారా గ్రూప్-1, గ్రూప్ -2 ఉద్యోగాల్లో అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.ఎస్. దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్, ఫణికుమార్, సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, కేపీహెచ్‌బీ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఖోఖో (పురుషులు) జేఎన్‌టీయూహెచ్(ప్రథమ), సీఎంఆర్‌సెట్ మేడ్చల్ (ద్వితీయ), ఖోఖో (బాలికలు) జి. నారాయణమ్మ కాలేజ్ (ప్రథమ), సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ మేడ్చల్ (ద్వితీయ) కబడ్డీ (పురుషులు) వీజేఐటీ కాలేజ్ (ప్రథమ), ఎంఎల్‌ఆర్‌ఐటీ కాలేజ్ (ద్వితీయ), కబడ్డీ (బాలికలు) ఐఏఆర్‌ఈ కాలేజ్ (ప్రథమ), వీజేఐటీ కాలేజ్ (ద్వితీయ)స్థానంలో నిలిచాయి.

చలివేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ మలేషియా టౌన్‌షిప్ పక్కన వన్ సిటీ అపార్టుమెంట్ రోడ్డులో క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మేకల మైఖేల్, దేవ సహాయం, రాజు, రేష్మ, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, శేషగిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సతీష్‌రెడ్డి

బంగారం, డాలర్లతో ఉడాయించిన నిందితుడి రిమాండ్

గచ్చిబౌలి: బంగారం కొనుగోలు, విదేశీ కరెన్సీ ఎక్స్ఛేంజ్ పేరిట అధిక కమీషన్ ఆశ చూపి ఘరానా మోసానికి పాల్పడిన నిందితుడు పుగల్ వాసన్(49)ను గురువారం రిమాండ్‌కు తరలించారు. గత శుక్రవారం గచ్చిబౌలిలో వ్యాపారులు చంద్రశేఖర్ నుంచి 500 గ్రాముల బంగారం, రఫీ నుంచి 18 వేల డాలర్లతో పారిపోయిన నిందితుడిని కోయంబత్తూర్‌లో అక్కడి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక బృందాలు నిందితుడిని వెంటాడుతుండగానే తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని 10ఎంఎం అడిషనల్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించారు. కేసు విచారణలో భాగంగా పుగల్ వాసన్‌ను కస్టడీకి ఇవ్వాలని కస్టడీ పిటీషన్ దాఖలు చేశారు. షింగనల్లూర్ కోయంబత్తూర్‌లో నివాసం ఉండే పగుల్‌వాసన్ స్థానికంగా నేత నేస్తుండేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో బంగారం కొనుగోలు, కరెన్సీ ఎక్స్ఛేంజ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నాడు.గచ్చిబౌలి పోలీసులు కస్టడీకి తీసుకొని విచారిస్తే ఎక్కడెక్కడ మోసాలకు పాల్పడ్డాడనే విషయాలు వెలుగుచూడనున్నాయి.

ఇక్కడే చదివి.. ఉన్నతులై..

హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు వీసీలైన వేళ | ముగ్గురికి అవార్డులు.. ఎంతోమందికి ఫ్యాకల్టీలుగా అవకాశం



పాండిచ్చేరి వీసీగా సీనియర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు

రాయదుర్గం: హెచ్‌సీయూ ఘనతను మరింత రెట్టింపు చేస్తున్నారు పూర్వ విద్యార్థులు. ఇటీవల హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు వీసీలుగా ఎంపికయ్యారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పదవులు చేపట్టారు. 50 ఏళ్ళ చరిత్ర కలిగిన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థుల్లో కొందరు ప్రజాప్రతినిధులుగా, మరికొందరు మంత్రులుగా ఉన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మరో ఇద్దరు వైస్ చాన్స్‌లర్లుగా ఉన్నారు.

ఇద్దరికి వీసీలుగా అవకాశం

- డాక్టర్ జీపీ రాజశేఖర్ హెచ్‌సీయూలో 1993-97లో స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియామకమయ్యారు.
- సీనియర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో 1992లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. బయో టెక్నాలజీ విభాగంలో పని చేస్తున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలపై పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా నియమించారు. కాగా ఆయన గత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

అవార్డులు ..

- డాక్టర్ మనోరంజన్ సాహూ ఎంఏ ఎకనామిక్స్ 2010-12 పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ ఎంజే మనోహర్‌రావు యంగ్ ఎకనామిస్ట్ అవార్డును ఇండియన్ ఎకనామెట్రిక్ సొసైటీ ద్వారా అందుకున్నారు.
- డాక్టర్ ఎమ్మాడి నవీన్‌కుమార్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్. ఆత్మనిర్భర్ డిజిటల్ భారత్ సమ్మిట్-2024లో టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డును పొందారు.
- హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని డాక్టర్ సుజితా పంబోలాకు ఇటీవల ప్రతిష్టాత్మకమైన యునెస్కోలోని ప్రోగ్రామింగ్ యూనిట్ విమెన్ ఇన్ సైన్స్ ఫర్ ది డెవలపింగ్ వరల్డ్- నేషనల్ చాప్టర్ ఆఫ్ ఇండియా (ఓడబ్ల్యూఎస్‌డీ-ఎన్‌సీఐ) ద్వారా అచీవర్స్ అవార్డు స్వీకరించారు.



హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని డాక్టర్ సుజితాపంబోలా ఇటీవల అచీవర్స్ అవార్డును అందుకున్న దృశ్యం

ఇతర పదవుల్లో..

హెచ్‌సీయూలో ఎంఏ పొలిటికల్ సైన్స్ 2005-07 సంవత్సరం పూర్వ విద్యార్థి డాక్టర్ చంద్రశేఖర్ హోటా ఒడిశా సాహిత్య అకాడమీ కార్యదర్శిగా తాజాగా నియమితులయ్యారు. అలాగే ఒడిశా సంగీత నాటక అకాడమీ అదనపు బాధ్యతలను నిర్వహిస్తారు.

- డాక్టర్. సుజిత 2009లో హెచ్‌సీయూ ఎంఎస్సీ బయోటెక్నాలజీలో మెడల్ అందుకున్నారు. పూర్వ విద్యార్థి ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా నియామకమయ్యారు.
- శిశురంజన్ పూర్వవిద్యార్థి ఎంఏ ఎకనామిక్స్ 2008-10 విద్యార్థి బార్‌క్లేవ్స్ గ్లోబల్ సర్వీసెస్ ఇండియా మోడల్ రిస్క్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు.ఈ సంస్థ లండన్‌లో ఉంది
- డాక్టర్ సుజిత పొంబాలా ఎంఎస్సీ-2009 ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్(ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా నియమితులయ్యారు.
- పూర్వ విద్యార్థి అసిత్‌రంజన్ మహంతి ఎంఏ-1993, అమరేష్ సమంత్రే ఎంఏ- 1997 పీహెచ్‌డీ 2000, ప్రసాద్‌నాయక్ ఎంఏ-2000 పూర్తి చేయగా వీరు ముగ్గురు ఒడిశా రాష్ట్ర ఆరవ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులుగా నియమితులయ్యారు.



టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డు స్వీకరించిన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి నవీన్‌కుమార్

ఫ్యాకల్టీలుగా..

- డాక్టర్ శ్రీనివాసరావు స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ 2010-16లో పీహెచ్‌డీ, 2008-10లో ఎంటెక్ పూర్తి చేసి ఐఐటీ రోపర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1గా నియమితులయ్యారు.
- డాక్టర్ .బాపూజీ పూర్వ విద్యార్థి అప్‌లైడ్ లింగ్విస్టిక్‌లో ఎంఫిల్ 2008-10, పీహెచ్‌డీ 2010-19 పూర్తి చేసిన ఆయన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) కోల్‌కతాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.